Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 5 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 28 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు



**చండీగఢ్ :** పాకిస్థాన్ ఐఎస్ఐ సహకారంతో భారీ ఉగ్రకుట్రను జరిగిన ప్లాన్‌ను పంజాబ్ పోలీసులు శుక్రవారంనాడు భగ్నం చేశారు. టెర్రర్ మాడ్యూల్ ఆటకట్టించారు. ఉగ్ర కుట్రకు పన్నాగం పన్నిన ఒక మైనర్‌తో సహా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌కు చెందిన వారిగా గుర్తించారు. భారీ ఉగ్రకుట్రను భగ్నం చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. అమృత్‌సర్‌లో లక్షిత హత్యలు, పోలీసు స్టేషన్లపై దాడులకు ఈ టెర్రర్ మాడ్యూల్ ప్లాన్ చేసినట్టు చెప్పారు. 'ఇంటెలిజెన్స్ సమాచారంతో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్ ఈ ఆపరేషన్ నిర్వహించింది. పాక్ ఐఎస్ఐ సహకారం కలిగిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ టెర్రర్ మాడ్యూల్‌ను విజయవంతంగా పట్టుకున్నాం. యూకేకు చెందిన నిషాన్ సింగ్, పాకిస్థాన్‌కు చెందిన టెర్రరిస్ట్ హర్విందర్ రిండాలు దీనిని ఆపరేట్ చేస్తున్నారు. బీకేఐతో అసోసియేషన్ కలిగిన ఒక జువనైల్, మరో ఇద్దరిని అరెస్టు చేశాం' అని డీజీపీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఒక పిస్తోలు, మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీజీపీ చెప్పారు. పట్టుబడిన ఇద్దరిని అమృత్‌సల్ రూరల్‌కు చెందిన సెహజ్‌పాల్ సింగ్, విక్రమ్‌జిత్ సింగ్‌గా గుర్తించామని, మరో జువెనైల్ కూడా ఉన్నాడని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, పేలుడు పదార్థాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మొహాలి పోలీస్ స్టేషన్‌ను ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. రాష్ట్రంలో టెర్రర్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసి, సంస్థాగత నేరాలను నిర్మూలించడం ద్వారా శాంతి, సామరస్య స్థాపనకు పంజాబ్ పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నారని వివరించారు. దీనికి ముందు ఏప్రిల్‌లో పంజాబ్ పోలీసులు ఐఎస్ఐ సహకారం ఉన్న ఖలిస్థాన్ టెర్రర్ మాడ్యూల్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు. రెండు రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌లు, రెండు హ్యాండ్ గ్రెనేడ్‌లు, ఐఈడీలు, ఆర్‌డీఎక్స్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## సీఎం సూచనలతోనే ముందుకు : మంత్రి దుర్గేష్



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిని 20 శాతానికి తీసుకెళ్లి.. సీఎం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను నెరవేరుస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం పూర్తి నిరాదరణకు గురైందని విమర్శించారు. గత ప్రభుత్వ విషాద ఛాయలు మళ్లీ పునరావృతం కాకుండా చేస్తామని తెలిపారు. ఈ రంగంలో ఆకాశమే హద్దు – అవకాశాలు వదలొద్దు అన్న సీఎం సూచనలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ రంగం ద్వారా యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగమన్నారు. 974 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం పర్యాటకాభివృద్ధికి అద్భుత అవకాశమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

**పర్యాటక రంగంలో ఏపీ కీలక పాత్ర : సుమన్**

2029కి 25 మిలియన్ ఉద్యోగాలు సృష్టించాలని... 2.42 లక్షల కోట్లు పర్యాటకం ద్వారా దేశానికి వస్తోందని కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి సుమన్ బిల్లా తెలిపారు. పర్యాటక రంగంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 75 కొత్త విమానాశ్రయాలు దేశంలో నిర్మితం అయ్యాయని.. ఇండిగో, టాటాల సంస్థలే 1000కి పైగా విమానాలు నడుపుతున్నాయని చెప్పారు. మనం ఇంకా 5 శాతం గానే పర్యాటకం ఉండడానికి కారణాలు ఏమిటన్నది విశ్లేషించుకో వాలని అన్నారు. దేశంలో 250 కోట్ల మంది ప్రయాణాలు చేస్తున్నా రని.. అందులో 47 కోట్ల మంది హోటళ్లు, షాపింగ్ కోసం పర్యాటకానికి వస్తున్నారని చెప్పారు. ఈ సంఖ్య పెద్దదే అయినా ఇంకా పెంచుకోవాల్సి ఉందన్నారు. 2.7 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్తుంటే 1.9 కోట్ల మంది విదేశాల నుంచి వస్తున్నా రన్నారు. ఇంతమంది భారతీయులను దేశంలోని పర్యాటక ప్రాంతా లకు మళ్లిస్తే సంపద పెరిగినట్టే అని పేర్కొన్నారు. ఇంత మంది పర్యాటకులను ఆకట్టుకోవాలంటే బ్రాండెడ్, అన్ బ్రాండెడ్ హోటల్ గదులు పెరగాల్సి ఉందన్నారు. 2029 నాటికల్లా ఈ సామర్థ్యం మూడు రెట్లకు పెరగాల్సి ఉందని.. మరిన్ని పెట్టుబడులు పర్యాటక రంగంలో హోటల్ బిజినెస్‌లో పెరగాలన్నారు. 15 ప్రాంతాలు అభివృద్ధి చేయాలని జాతీయ స్థాయిలో ప్రణాళిక చేశామని.. తద్వారా మౌలిక సదుపాయాలు పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పర్యాటక ప్రాజెక్టు పెట్టాలంటే మన దేశంలో 56 లైసె న్సులు తీసుకోవాల్సి ఉంటోందని.. ప్రతీ లైసెన్సుకు 60 రోజుల సమయం పడుతోందన్నారు. సింగపూర్‌లో కేవలం 25 లైసెన్సులు రెండు వారాలు మాత్రమే పడుతోందని... లైసెన్సుల జారీ వేగం పెరగాలని అభిప్రాయపడ్డారు. ఏపీ పర్యాటక పాలసీ పెట్టుబడులను ఆకర్షించేలా ఉందని... రాష్ట్రానికి చాలా ప్రకృతి వనరులు ఉన్నాయన్నారు. తిరుపతి లాంటి చోట్ల 10 వేలకు పైగా బ్రాండెడ్ హోటల్ రూములు అవసరం ఉంటే ప్రస్తుతం ఇవి వెయ్యిలోపే ఉన్నాయని అన్నారు. కనీసం 3 – 4 రోజుల పాటు పర్యాటక ప్రాంతాల్లో ఉండేలా ఏర్పాట్లు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లాంటి ప్రాంతాలు ఏపీలో చాలా ఉన్నాయని.. బౌద్ధ క్షేత్రాలు, ఎకో టూరిజం, బీచ్‌లు ఉన్నాయని, కోనసీమ, అరకు, పాపికొండలు లాంటి ప్రాంతాలను చాలా అభివృద్ధి చేయాల్సి ఉందని సుమన్ బిల్లా పేర్కొన్నారు.


## సీఎం కాన్వాయ్‌లోని 19 కార్లు ఒకేసారి బ్రేక్‌డౌన్.. ఎందుకంటే...

**భోపాల్ :** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు మార్గమధ్యంలో అనూహ్యమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కాన్వాయ్‌లోని 19 వాహనాలు ఒకదాని వెంట మరొకటి రోడ్డుపైనే నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి షెడ్యూల్ ప్రకారం రత్లాలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి శుక్రవారం నాడు బయలుదేరారు. కొంతదూరం వెళ్లాక 19 ఎస్‌యూవీలతో కూడిన కాన్వాయ్‌లో సమస్యలు తలెత్తాయి. వాహనాలు జర్క్‌లు ఇస్తూ నిలిచిపోయాయి. వాహనాలను నెట్టే ప్రయత్నం చేసినప్పటికీ అవి స్టార్ట్ కాలేదు. దీంతో మరో ప్రత్యేక వాహనంలో సీఎం ముందుకు సాగారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనాలు రోడ్డుపైనే మొరాయిం చడానికి స్థానిక పెట్రోల్ పంప్‌లో డీజిల్ కల్తీ కావడమే కారణంగా అధికారులు అనుమానిస్తున్నారు. తొలుత ఒకటి, రెండు కార్లలో సమస్య తలెత్తినా ఆ తర్వాత అన్ని వాహనాలు నిలిచిపోయినట్టు కాన్వాయ్ డ్రైవరు శుభం వర్మ తెలిపారు. స్థానిక పెట్రోల్ పంప్‌లో 350 లీటర్ల డీజిల్ నింపామని, అయితే కల్తీకి అవకాశమే లేదని సిబ్బంది చెబుతున్నారని పేర్కొన్నారు. కాగా,



స్థానిక యువకుడు ఒకరు ఇదే పెట్రోల్ పంప్ నుంచి నింపుకున్న డీజిల్‌లో వాటర్ లేయర్లు కనిపించడంతో డీజిల్ శాంపుల్స్ సేకరించిన ఫుడ్ అండ్ సివిల్ సప్లై అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఆ శాంపుల్స్‌లో నీళ్లు కలిసినట్టు గుర్తించారు. దీనిపై మరింత విచారణ జరిపి సమగ్ర నివేదకను రత్లాం కలెక్టర్‌కు అందజేస్తామని ఫుడ్ డిపార్ట్‌మెంట్ అధికారి ఆనంద్ గోలే తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ పంప్‌ను అధికారులు సీజ్ చేశారు.

## టూరిజం కాన్‌క్లేవ్‌లో సీఎం చంద్రబాబు కీలక సూచన



**అమరావతి, (రాజధాని వార్తలు):** సామాన్యులకు అందుబాటులో ఉండేలా కార్వాన్ పర్యాటకం ఉండాలని టూరిజం కాన్‌క్లేవ్ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. శుక్రవారం విజయవాడలోని ఒక హోటల్‌లో జీఎఫ్ ఎస్‌టీ టూరిజం కాన్‌క్లేవ్ జరిగింది. ఈ సదస్సుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నడిచే హోటల్ రూములతో రూపొందించిన కార్వాన్‌ను ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం కార్వాన్‌లను వారు పరిశీలించారు. పర్యాటక రంగంలో రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ఈ టూరిజం కాన్‌క్లేవ్ జరుగుతోంది. అయితే ఇప్పటికే రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదాను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సంగతి తెలిసిందే. ఇక ఈ కాన్‌క్లేవ్ వేదికగా.. సీఎం చంద్రబాబు సమక్షంలో రూ.10, 039 కోట్ల విలువైన పెట్టుబడులపై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే పర్యాటకుల కోసం విశాఖపట్నం, రాజధాని అమరావతి, ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కొత్తగా హోటళ్ల నిర్మాణం కోసం ఒప్పందాలు చేసుకోనున్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో రాష్ట్ర పర్యాటక రంగంపై వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పలువురు పారిశ్రామిక వేత్తలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా రామ్‌దేవ్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ప్రగతికి, ఆనందానికి, యోగానికి భగవంతుడు పంపిన వరమని అభివర్ణించారు. తన నుంచి ఏ విధంగా యోగా నేర్చుకుం టారో.. అదే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు నుంచి మన దేశ రాజకీయ నాయకులు రాజకీయాలు నేర్చుకుంటారని ఆయన ఆకాంక్షించారు. అందరికి ఆర్గానిక్, లాంగివిటీ, ఇమ్యూనిటీ ఫుడ్‌ను అన్ని హోటల్స్‌లో అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని బాబా రామ్‌దేవ్ స్పష్టం చేశారు. అలాగే యోగా, ఆయుర్వేదం, నేచురోపతి సర్వీసులు ఉచితంగా అందిస్తామన్నారు. హార్సలీ హిల్స్ నుంచి అరకు, రాజమండ్రి, సూర్యలంక తదితర ప్రాంతాల్లో తాను పర్యటించానని తెలిపారు. ఈ సేవలకు ఆ ప్రదేశాలు సరిపోతాయని వివరించారు. అయితే తాను దేశ విదేశాల్లో పర్యటించానని.. వీట న్నింటి కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత అందంగా ఉందన్నారు. గతంలో తాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చానని.. కానీ ఈ దృష్టితో ఎప్పుడు చూడలేదని చెప్పారు. ఏపీలో గోదావరి నది, సముద్రం ఉన్నాయని.. అలాగే దిండిలో హౌస్ బోట్ సైతం ఉందని వివరిం చారు. రిలయన్స్ సంస్థ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ వివాహం సైతం ఏపీలో చేయాల్సిందన్నారు. ఏపీలో అన్ని ఉన్నాయని చెప్పారు. ఏపీ వెడ్డింగ్ డెస్టినేషన్ అవుతుందని ఆయన ఆకాంక్షించారు. అందుకోసం ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. సనాతన ధర్మంలో వివాహం ఎలా చేసుకోవాలో ఇక్కడ ఏర్పాటు చేద్దామని బాబా రామ్‌దేవ్ పేర్కొన్నారు. దీంతో ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ వెండ్డింగ్ డెస్టినేషన్ అవుతుందని ఆకాంక్షించారు. అందుకోసం తాను ఉచితంగా ప్రచారం నిర్వహిస్తానన్నారు. ఇలాంటి కొత్త ఐడియాలు అందరికీ రావాల్సి ఉందని పేర్కొన్నారు. తాను పతాంజలి కోసమే కాదని.. భారతదేశం కోసం సైతం పని చేస్తానని వివరించారు. తన వయస్సు 65 ఏళ్లని బాబా రామ్‌దేవ్ గుర్తు చేశారు. అయితే మానసిక వయస్సు మాత్రం 25గా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బయోలాజికల్ ఏజ్ సైతం తగ్గుతుం దన్నారు. మ్యాన్ ఆఫ్ హోప్ అంటే చంద్రబాబు నాయుడు అని అభివర్ణించారు. ఆయనకు సూపర్ కంప్యూటర్ లాంటి తెలివి ఉం దని బాబా రామ్‌దేవ్ వివరించారు. హర్సలీ హిల్స్‌ను సైకియాట్రిక్ వెల్‌నెస్ సెంటర్‌గా ప్రపంచపటంలో నిలుపుతానని ఈ సందర్భంగా ప్రకటించారు. ఏపీ టూరిజంకు బ్రాండ్ అంబాసిడర్ కావడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఏపీ ఇంత అందంగా ఉంటుం దని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసునన్నారు. గుజరాత్, మహారాష్ట్రతోపాటు హిందీ మాట్లాడే రాష్ట్రాలకు వెళ్లి... ఆంధ్రప్రదేశ్ గురించి వివరిస్తానని తెలిపారు. ప్రపంచం మొత్తానికి ఏపీ టూరి జంను పరిచయం చేస్తానన్నారు. ఏపీని వెల్‌నెస్‌లో ప్రపంచంలోనే గొప్పగా చేస్తానని హామీ ఇచ్చారు. హర్సిలీ హిల్స్, అరకులో వాతా వరణం చాలా బావుంటుందన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల వాతా వరణాలు ఉన్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు లాంటి వ్యక్తి ఎగ్జిక్యూషన్ విషయంలో మరెవరు లేరన్నారు.

## సింగయ్య మృతి కేసు.. జగన్ వాహనం చెకింగ్



**గుంటూరు, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో సింగయ్య అనే వృద్ధుడు మాజీ సీఎం కారు కింద నలిగి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్ రెడ్డి వాహనాన్ని రవాణా శాఖ అధికారులు ఈరోజు (శుక్రవారం) తనిఖీ చేశారు. సింగయ్య మృతిపై ఇప్పటికే నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో జగన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉంచారు. ఈ క్రమంలో నేడు ఏపీ 40 డీహెచ్ 2349 వాహనం ఫిట్‌నెస్‌ను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎంవీఐ గంగాధర ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు జరిగాయి. కాగా.. ఇటీవల రెంటపాళ్ల పర్యటనకు జగన్ వచ్చిన సందర్భంగా గుంటూరు ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ అధినేత కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై గుంటూరు నల్లపాటు పీఎస్‌లో కేసు నమోదు అవగా.. ఏ1గా డ్రైవర్ రమణారెడ్డి, ఏ2గా జగన్ మోహన్ రెడ్డి, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, విడుదల రజినీ, పేర్నినాని పేర్లు చేర్చారు. కేసు నమోదు అనంతరం నల్లపాడు పోలీసులు సింగయ్య మృతికి కారణమైన జగన్ ప్రయాణించిన కారును తాడేపల్లికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆ కారును గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉంచారు. ఈరోజు గుంటూరుకు చెందిన రవాణా శాఖ అధికారులు.. జగన్ కారు ఫిట్‌నెస్‌ను చెక్ చేశారు. ఆర్టీవోకు చెందిన మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓ టీం గుంటూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చి జగన్ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనం ఫిట్‌గా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే జగన్ వాహనం విషయంలో గుంటూరు ఎస్పీ రెండు రకాల ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. తొలుత జగన్ పర్యటన రోజు 0001 సఫారీ వాహనం ఢీకొని సింగయ్య మృతిచెందారని ప్రకటిం చారు. నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే పడి సింగయ్య మృతి చెందిన వీడియో బయటకు రావడంతో గుంటూరు ఎస్పీ మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్ వాహనం కింద పడే సింగయ్య మృతి చెందినట్లు చెప్పారు. అలాగే ఈ ప్రమా దానికి సంబంధించి డ్రైవర్ రమణారెడ్డి, జగన్‌తో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. దీనిపై గుంటూరు జిల్లా పోలీసులపై కూడా అనేక విమర్శలు వచ్చిన నేపథ్యంలో.. తదుపరి విచారణలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూడాలని గుంటూరు పోలీసులు భావిస్తున్నారు.

**జగన్‌కు స్వల్ప ఊరట**

మరోవైపు ఏపీ హైకోర్టులో మాజీ సీఎం జగన్‌కు స్వల్ప ఊరట లభించింది. సింగయ్య మృతి ఘటనలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్ట్‌లో జగన్ క్వాష్ పిటీషన్‌ను దాఖలు చేశారు. దీనిపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా.. జగన్ తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే కేసు విచారణను జూలై 1కి (మంగళవారం)కు వాయిదా వేసింది కోర్టు. అప్పటి వరకు ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రథయాత్ర సందర్భంగా జగన్నాథ స్వామి టౌన్ కొత్త రోడ్ స్వామి దేవాలయం నుండి సాయంత్రం ఐదు గంటలకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మేయర్ శ్రీనివాసరావు వన్ టౌన్ సిఐ దేవుడు బాబు ముందుగా కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. సీతారామస్వామి దేవాలయం నుండి ఒక రథోత్సవము అంబిరమన్నార్ దేవాలయం నుండి రథము ప్రతిసారి కూడా ఈ రథోత్సవ జగన్నాథ స్వామితో ఈ మూడు రథోత్సవానికి కూడా బయలుదేరుతాయి. రథయాత్ర ఉత్సవం, ప్రపంచంలో గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది, ఇది జగన్నాథుడు, బలభద్రుడు మరియు దేవి సుభద్రల దివ్య ప్రయాణాన్ని గుర్తు చేస్తుంది. భారతీయ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయిన ఈ కార్యక్రమం సార్వత్రిక సోదరభావం, ప్రేమ మరియు భక్తిని సూచిస్తుంది.

**రథోత్సవం యొక్క ముఖ్యమైన కార్యక్రమాలు**

1. రథోత్సవం : ఈ ఉత్సవంలో భాగంగా అందంగా అలంకరించబడిన రథాల మీద శ్రీ జగన్నాధుడిని అలంకరించి ఉండగా, భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆ రథాన్ని లాగటం జరిగింది. ఈ ఊరేగింపు జగన్నాథ స్వామి టౌన్ కొత్త రోడ్ నుండి టర్నర్ చౌల్ట్రి వరకు గొప్ప ఊరేగింపు జరిగింది. 2. సాంస్కృతిక ప్రదర్శనలు: ఈ కార్యక్రమంలో ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించబడ్డాయి. 3. భక్తి కార్యకలాపాలు: ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరూ, కీర్తనలు, నృత్యాలు, భగవంతుడి యొక్క నామస్మరణం చేస్తూ వివిధములైన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనటం జరిగింది. 4. ప్రసాదం వితరణ : సుమారు పదివేల మందికి మహా ప్రసాదం అందించటం జరిగింది. దారి పొడుగునా అనేక మంది భక్తులకు మా సేవ కర్తలు ప్రసాదం అందించటం జరిగింది. ఈ రథయాత్ర ఉత్సవం ఇంత చక్కగా మరియు వైభోగంగా జరగటానికి సహకరించిన మా ప్రత్యేక అభినందనలు మరియు ధన్యవాదాలు. ఇట్లు, రాజగోపాల్ రెడ్డి, జగన్నాధస్వామి దేవాలయం, టౌన్ కొత్త రోడ్ విశాఖపట్నం.

# చింతపల్లిలో కొత్త అధ్యాయానికి శ్రీకారం

## - ఐసిడిఎస్ అధికారిణిగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

## - 250 అంగన్వాడి కేంద్రాల పర్యవేక్షణకు ప్రాధాన్యం



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో ఫైల్స్ పరిశీలిస్తూ అధికారిక విధులను ప్రారంభించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వడ్డాది మాడుగుల ప్రాజెక్ట్ నుంచి ఆమెను చింతపల్లికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 250 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ అవుతున్న అంగన్వాడి సరుకులు అన్ని కేంద్రాలకు సమయానికి, సక్రమంగా చేరేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు కలిసికట్టుగా పనిచేస్తేనే లక్ష్యాలు చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. అందుకే తగిన సమన్వయం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని, అందరూ సహకరించాలని ఆమె కోరారు.

# అంగరంగ వైభవంగా అగనంపూడి శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర





**అగనంపూడి, (రాజధాని వార్తలు):** స్వామి ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం ఉదయం బలభద్ర సుభద్ర సమేత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు చేసి సాయంకాలం జగన్నాథ స్వామి గుడిలో నుండి విగ్రహాలను అగనంపూడి సెంటర్లో ఉన్న రథములో మేళ తాళాలతో చేర్చితిరి 79, 85, 87 వార్డుల కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ బోండా జగన్ దంపతులతో ప్రత్యేక పూజలు చేసితిరి. అనంతరం రథమును తాళ్లతో భక్తులు లాగి అగనంపూడి సెంటర్ సిగ్నల్ పక్కన ఉన్న స్వామి విగ్రహాలను తీసుకెళ్లి విగ్రహాలను అతి పవిత్రంగా పూజలు నిర్వహించి ఆలయ ఈవో పద్మావతి పర్యవేక్షణలో రథ యాత్ర జరిగినది.

ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ 79 85 టిడిపి వార్డ్ కమిటీ అధ్యక్షులు కరణం జగదీష్ కర్రీ దశంద్ర 79 వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి విజయ్ అగనంపూడి మండలం బిజెపి నాయకులు కోసూరి తాతారావు మరియు అగనంపూడి పరిసర ప్రాంత భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దువ్వాడ శాంతి పద్ధతుల సిఐ మహేశ్వర్ రావు స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ సిఐ కే వెంకట్రావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ కేర్ హాస్పిటల్స్ వైద్యచాతుర్యం

## - రోజు కూలీ ప్రాణం కాపాడిన వైద్యులు - క్లిష్టమైన యానురిజం ఆపరేషన్ విజయవంతం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్లో వైద్య బృందం ఓ రోజుకూలీ ప్రాణాన్ని ప్రాణాపాయ స్థితి నుండి క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా కాపాడింది. కూలీ పని చేసుకునే జొన్నాడ నల్లెంసెట్టి (49), గత సంవత్సరం నుంచి ఊపిరి పీల్చడంలో ఇబ్బంది, కడుపునొప్పి, దగ్గుతో రక్తం వంటి సమస్యలతో బాధపడుతూ, మొదట కొన్ని ఇతర ఆసుపత్రుల్లో ప్రాథమిక పరీక్షలు చేయగా, తరువాత సమగ్ర పరిశీలన మరియు చికిత్స కోసం ఇటీవల కేర్ హాస్పిటల్సును ఆశ్రయించారు. సిటీ ఆర్టోగ్రామ్ పరీక్షలో గుండెకు దగ్గరగా ఉన్న ఒక ప్రధాన రక్తనాళంలో బెలూన్లాంటి వాపు (అనూరిజం) కనిపించింది. దాని చుట్టూ కొంత రక్తస్రావం కూడా ఉంది. గుండె పనితీరు బాగుంది, గుండె రక్తనాళాలు కూడా సాధారణంగా ఉన్నాయి. ఊపిరితిత్తుల స్కాన్లలో ఇన్ఫెక్షన్ మరియు గుబురులాంటి ఖాళీలు (కావిటీస్) కనిపించాయి. బ్రోంకోస్కోపీ ద్వారా వాయుమార్గాల్లో మలినాలు మరియు రక్తం గడ్డకట్టినట్లు తెలిసింది. రక్త పరీక్షలు తీవ్రమైన మంట (ఇన్ఫ్లమేషన్) ఉన్నట్లు చూపించాయి. కడుపు ఎండోస్కోపీ పరీక్షలో జీర్ణవ్యవస్థలో ఎలాంటి లోపల రక్తస్రావం లేదని తేలింది. ఈ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, డాక్టర్లు కార్డియోపల్మనరీ బైపాస్ (సిపిబీ) సహాయంతో అనూరిజం సర్జరీ చేశారు. ఆపరేషన్ తర్వాత ఆయన్ని తక్కువ మందులతో సిటీ ఐసీయూకి తరలించారు. శస్త్రచికిత్స తర్వాత రోగికి అకస్మాత్తుగా మూర్ఛలు వచ్చాయి, ఎడమ వైపు బలహీనత (హెమిపరేసిస్) కనిపించింది. వెంటనే న్యూరాలజీ నిపుణుడిని సంప్రదించి చికిత్స ప్రారంభించారు. కొన్ని రోజుల్లో నాడీ సంబంధిత లక్షణాలు మెరుగయ్యాయి. మూడవ రోజు ఆయనను వెంటిలేటర్ నుండి తొలగించారు. కార్డియోథొరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, న్యూరాలజీ, అనస్తీషియా, ఐసీయూ విభాగాల మధ్య సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం నల్లెంసెట్టి స్థిర స్థితిలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రేవంత్ మారంరెడ్డి మాట్లాడుతూ, “ఈ రకమైన అనూరిజమ్స్ చాలా అరుదైనవి. తక్కువ సమయంలో గుర్తించి చికిత్స చేయకపోతే ప్రాణానికి ముప్పు వస్తుంది. ఇది ముఖ్యమైన రక్తనాళాలకు దగ్గరగా ఉండటం, చీలికకు అవకాశముండటం వల్ల శస్త్రచికిత్స కాస్త క్లిష్టంగా మారింది. అయినప్పటికీ నల్లంసెట్టి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం, ఆరోగ్యం బాగుపడటం చూసి ఆనందంగా ఉంది. ఇది కేర్ హాస్పిటల్స్లో ఉన్న ఆధునిక శస్త్రచికిత్సా నైపుణ్యం మరియు ముందస్తు రిఫరల్ ఎంత ముఖ్యమో చూపిస్తుంది అని చెప్పారు. ఈ కేసు కేర్ హాస్పిటల్స్ ఇచ్చే వైద్యం ఎలా ఉంటుందో స్పష్టంగా చూపిస్తుంది. సానుభూతితో కూడిన, అందరికీ సమానంగా అందే సేవలు, ఆర్థికంగా సవాళ్లు ఉన్నా కూడా, నల్లెంసెట్టి దేశంలోనే ఉత్తమ వైద్య నిపుణులచేత అత్యుత్తమ చికిత్స పొందారు. అవసరమైన ప్రతివారికి మంచి ఆరోగ్య సంరక్షణ అందించాలనే మా నిబద్ధతను ఈ విషయం మరోసారి గుర్తు చేస్తోంది అని కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌధురి అన్నారు. అత్యాధునిక వైద్యం అందించడంలో కేర్ హాస్పిటల్స్ నిబద్ధతకు ఈ ఘటన సామాజిక, ఆర్థిక పరమైన పరిమితులు లేకుండా అందరికీ ప్రాణాపాయం నివారించే చికిత్స అందించడమే లక్ష్యంగా పని చేస్తోంది.

# సందడిగా ఎన్ని శ్రీను జన్మదిన వేడుకలు



**ఆనందపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర బీసీ సంక్షేమ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు జన్మదినోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం సందడిగా జరిగాయి. ఈ వేడుకలకు పార్టీలకతీతంగా నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు, తూర్పు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ సమక్షంలో ఎన్ని శ్రీనివాసరావు చేత బర్తే కేక్ కట్ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్ని శ్రీనివాసరావు వివాద రహితుడిగా, మృదుస్వభావిగా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అడిగిన వారికి తోచినంత సహాయం చేసే దయాగుణం ఉండడం కూడా విశేషమని, రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తమ్మిన అప్పలరాజు, తాడి శివ, రౌతు నాగరాజు, సన్యాసిరావు, ఎండాడ నుండి శ్రీనుబాబు, కృష్ణయ్య ఉషా విద్యానికేతన్ కరస్పాండెంట్ చందక పాండురంగ, షినగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ జి.ఏ.వి రమణ, ఎస్సై యు.మహేష్





**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** యువత మాదక ద్రవ్యా లకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ జిఏవి రమణ, ఎస్.ఐ యు మహేష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు మరియు అక్రమ రవాణా నిరోధ నివారణ దినోత్సవం సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గురువారం సాయి సిద్ధార్థ కళాశాల నుంచి బోడసింగ్ పేట గ్రామ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటి జోలికి అసలు పోవద్దని అన్నారు. ఈ వయసు నుంచే వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐయు మహేష్ సూచించారు. యువత మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, తద్వారా వారి భవిష్యత్తుకు, వారి తల్లితండ్రులకు మనస్థాపానికి గురి చేస్తున్నారని వారు అన్నారు. మాదకద్రవ్యాలు వాడటం వలన యువత భవిష్యత్తు, దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని తెలియజేశారు

మత్తు పదార్థాలను సేవించిన, వాటిని అమ్మిన, రవాణా చేసిన కఠిన శిక్షలు ఉంటాయని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బండారు బాలాజీ, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, పాల్గొన్నారు.

# ఘనంగా అశోక్ గజపతిరాజు జన్మదినోత్సవ వేడుకలు







**విజయనగరం, (రాజధాని వార్తలు):** మాజీ కేంద్ర మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అశోక్ బంగ్లాలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సింహాచలం దేవస్థానం నుండి, రామతీర్థం దేవస్థానం నుండి, పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అశోక్ గజపతి రాజు రాజుకి ఆశీస్సులు అందజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రేమ సమాజంలో వృద్ధులతో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, విజయనగరం ఎంఎల్ఏ అదితి గజపతి రాజు కేక్ కట్ చేయించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ద్వారపూడి గ్రామంలో అశోక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఆదర్శాలు ఎప్పుడూ ఆచరణీయమైనప్పుడే వాటికి విలువ అని అన్నారు. అధికారం ఉన్నప్పుడు అహంకారంతో పోతే ప్రజాస్వామ్యంలో అట్టివారికి చోటు ఉండదని అన్నారు. ప్రజలతో కలిసి ఉండటమే కాకుండా అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు. అందరూ సమిష్టిగా నిలిచి దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

# ప్రతీ రోజూ రాత్రి అది ఉండాల్సిందే!



తెలుగు చిత్ర పరిశ్రమలో తన అందంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో నిధి అగర్వాల్ కూడా ఒకరు. సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచమైన నిధి అగర్వాల్, ఆ తర్వాత పలు సినిమాల్లో నటించారు. కానీ నిధి అగర్వాల్ నటించిన సినిమాల్లో రామ్ సరసన చేసిన ఇస్మార్ట్ శంకర్ తప్ప మిగిలినవేవీ తనకు మంచి విజయాల్ని తెచ్చిపెట్టింది లేదు. నిధి కెరీర్లో సక్సెస్ రేట్ తక్కువ ఉన్నప్పటికీ అమ్మడికి స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు బాగానే వస్తున్నాయి. ప్రస్తుతం నిధి చేతిలో రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులున్నాయి. అందులో ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటిస్తున్న హరి హర వీరమల్లు కాగా, రెండోది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన నటిస్తున్న ది రాజా సాబ్.

ఈ రెండు సినిమాలపై అందరికీ భారీ అంచనా లున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులు త్వరలోనే ఆడియన్స్ ముందుకు రానున్నాయి. ఇదిలా ఉంటే నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారనే విషయం తెలిసిందే. రెగ్యులర్‌గా ఏదొక పోస్ట్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకునే నిధి తాజాగా ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. తనకు ప్రతీ రోజూ రాత్రి మర్డర్ మిస్టరీ సినిమాలు చూసే అలవాటుందని, కొత్త కంటెంట్ దొరకడం లేదని, ప్లీజ్ కొన్ని సినిమాలను చెప్పమని, ఏ భాషైనా పర్లేదని పోస్ట్ చేశారు. నిధి అగర్వాల్ షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, నిధి పోస్ట్‌కు నెటిజన్లు క్రేజీగా కామెంట్స్ చేస్తున్నారు.

కాగా నిధి అగర్వాల్ ఇప్పుడు తన కెరీర్లో సరైన బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు తను చేసిన సినిమాలు ఎలా ఉన్నా సరే, తన నుంచి రాబోయే రెండు సినిమాలు మాత్రం ఆడియన్స్‌ను అలరించి, పెద్ద సక్సెస్ అవాలని కోరుకుంటు న్నారు. ఈ రెండూ సినిమాలూ సక్సెస్ అయితే నిధి కెరీర్ కొత్త మలుపు తిరగడం ఖాయం.

# నేచురల్ స్టార్‌తో కమ్ములా క్లాసా? మాసా?





కుబేర సక్సెస్‌తో శేఖర్ కమ్ములా పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెట్టారు. ఇప్పటికే ఈ చిత్రం 100 కోట్ల క్లబ్‌లో చేరింది. కుబేరతో కమ్ములా వంద కోట్ల క్లబ్లో అడుగు పెట్టారు. ఇంత వరకూ ఈయన బాక్సా ఫీస్ వద్ద సెంచరీ కొట్టలేదు. ఫిదా సినిమా 91 కోట్ల వసూళ్ల వద్ద ఆగిపోవడంతో ఆ ఫీట్ సాధ్యపడలేదు. అటుపై చేసిన చిత్రాలు ఆ రేంజ్ సక్సెస్‌ని అందుకోలేదు. అయితే పాన్ ఇండియాలో కుబేరకు ఈ రేంజ్ సక్సెస్ సరిపోదు. పాన్ ఇండియా రిలీజ్ అంటే 500 కోట్ల క్లబ్‌లో పడితేనే సిసలైన పాన్ ఇండియా సక్సస్ దక్కినట్లు. కానీ కుబేరతో అది సాధ్యమవ్వడం కష్టం. ఈ నేపథ్యంలో కమ్ములా తదుపరి చిత్రంతో ఆ రేంజ్‌ని టచ్ చేసేలా ప్రణాళి కను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నాడు. ఆయన తదుపరి సినిమా కూడా పాన్ ఇండి యాలోనే ఉంటుందని సమాచా రం. అందుకే నేచురల్ స్టార్ నానిని తన హీరోగా ఎంపిక చేసుకుంటున్నట్లు వార్త లొస్తున్నాయి. నాని ఇమేజ్‌కు తగ్గ స్టోరీ సిద్ధం చేయాలని కమ్ములా రెడీ అవుతున్నాడుట. అయితే ఇప్పటికే తన వద్ద స్టోరీ లైన్ ఉందని దాన్ని డెవలెప్ చేస్తే సరిపోతుందని కమ్ములా భావిస్తున్నాడుట. అందుకే ఏడాది సమయం పడుతుందని వినిపిస్తుంది. శేఖర్ కమ్ములా స్టోరీ కోసం ఎక్కువ సమయం తీసుకుంటారు. అందుకే ఆయన 25 ఏళ్ల కెరీర్‌లో కేవలం పది సినిమాలే చేయగలిగారు. కానీ అందులో చాలా సినిమాలు విజయాలు సాధించినవే. ఆయన నుంచి అట్టర్ ఫ్లాప్ సినిమా అంటూ ఇంతవరకూ లేదు. తదుపరి నానితో సినిమా అంటే భారీ ఎత్తున ఉం టుంది.

కమ్ములా అంటే క్లాసిక్ చిత్రాలకు బ్రాండ్. నానిపై కూడా మాస్ ఇమేజ్ కంటే క్లాస్ ఇమేజ్ ఎక్కువగా ఉంది. కెరీర్ ఆరంభంలో క్లాసిక్ చిత్రాలతోనే మెప్పించాడు. మరి అలాంటి స్టార్‌తో కమ్ములా క్లాస్ చిత్రం తీస్తాడా? మాస్ చిత్రం తీస్తాడా? అన్నది చూడాలి.


# గ్రాఫికల్ వండర్ రిలీజై అప్పుడే ఏడాది!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన గ్రాఫికల్ వండర్ ‘కల్కి 2898 AD’. నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన ఈ మూవీని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సి.అశ్వనీద్, ఆయన కుమార్తెలు నిర్మించారు. బాలీవుడ్ క్రేజీ లేడీస్ దీపికా పదుకునే, దిషా పటానీ ఇందులో ప్రభాస్‌కు జోడీగా నటించిన విషయం తెలిసిందే. దిషా పటానీ ప్రేమికు రాలిగా కనిపించగా, దీపికా పదుకునే దేవుడిరి జన్మనిచ్చే అమ్మగా కనిపించి ఆకట్టుకుంది. భూమిపై విధ్వంసాల అనంతరం మిగిలిన చివరి నగరం కాశీ నేపథ్యంలో మహా భారత కురుక్షేత్రానికి లింక్ పెడుతూ ఈ సినిమా సాగింది. రిలీజ్‌కు ముందే ప్రచార చిత్రాలతో అంచనాల్ని పెంచేసిన ఈ సినిమాని పాన్ ఇండియా మూవీగా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సరిగ్గా ఏడాది క్రితం జూన్ 27న విడుదల చేశారు. ఈ సినిమా విడుదలై నేటితో సరిగ్గా ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా చిత్ర బృందం శుక్రవారం ఓ పోస్టర్‌ని విడుదల చేసింది. ఏడాది పూర్తయిన సందర్భంగా సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నామని తెలిపింది.

ఒక సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ థియేటర్లని ఆక్రమించి ఏడాది కావస్తోంది. భారతీయ సినిమాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన విషయం ఇది. ఎపిక్ బ్లాక్ బస్టర్ విడుదలై ఏడాది పూర్తి కావడాన్ని సెలబ్రేట్ చేసుకుంటు న్నాం - అని ట్వీట్ చేసింది. ప్రస్తుతం మేకర్స్ షేర్ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే వరల్డ్ వైడ్‌గా సంచలనాలు సృష్టించిన ఈ సినిమాలో హేమా హేమీలైన లెజెండరీ యాక్టర్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలక పాత్రలు పోషించారు. అశ్వద్ధామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్‌గా కమల్ హాసన్ తమ తమ పాత్రల్లో అదరగొట్టారు. ప్రభాస్ చైల్డ్ క్యారెక్టర్‌కు గార్డియన్‌గా కనిపించే అతిథి పాత్రలో యంగ్ హీరో దుల్కర్ సల్మాన్, మరియమ్మగా శోభన, అతిథి పాత్రల్లో అర్జునుడిగా విజయ్‌దేవరకొండ, రూమీగా రాజేంద్ర ప్రసాద్, దివ్యగా మృణాల్ ఠాకూర్, ఉత్తరగా మాళవిక నాయర్, చింటూగా రామ్ గోపాల్ వర్మ, బౌంటీ హంటర్‌గా రాజమౌళి, అన్ క్రెడిట్ క్యారెక్టర్లలో మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణ్, ఫరియా అబ్దుల్లా, దర్శకుడు అనుదీప్ కె.వి, అవసరాల శ్రీనివాస్ కనిపించారు. రూ.600 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించింది. తొలి సారి ఏఐ టెక్నాలజీ వాడిన సినిమాగా సంచలనం సృష్టించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.1200 కోట్లు రాబట్టింది. ఈ మూవీ సాధించిన వరల్డ్ వైడ్ గ్రాస్ వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రా, నైజాం కలిపి రూ.285.80 కోట్లు రాబట్టింది. కర్ణాటక 73.70 కోట్లు, తమిళనాడు రూ.43.35 కోట్లు, కేరళ రూ.31 కోట్లు, రెస్ట్ ఆఫ్ ఇండియా రూ.317.40 కోట్లు, ఓవర్సీస్ రూ.281.80 కోట్లు అంటే రూ.30.21 మిలియన్‌లన్నమాట. టోటల్ వరల్డ్ వైడ్‌గా రూ.1003.05 కోట్ల గ్రాస్‌ని సాధించింది. ఇదిలా ఉంటే దీనికి సీక్వెల్‌గా రానున్న పార్ట్ 2 కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# సమంత స్టన్నింగ్ లుక్‌కి ఫ్యాషన్ ప్రపంచం ఫిదా!



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత తాజాగా ఓ స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. జిఓ పవర్ లిస్ట్ 2025 ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో ఆమె ధరించిన నెట్ డిజైన్ హై స్లిట్ గౌన్ లుక్‌కి నెటిజన్లు పాజిటివ్‌గా రియాక్ట్ అవుతున్నారు. బ్లాక్ కాంబినేషన్‌లో మెరిసిన ఈ డ్రెస్‌కు మ్యాచింగ్ మేకప్, స్ట్రెయిట్ హెయిర్ స్టైల్‌తో తన యాటి ట్యూడ్‌ను మరింతగా హైలైట్ చేసింది. ఈ ఫొటోషూట్‌లో సమంత అటిట్యూడ్, కాన్ఫిడెన్స్, స్టైల్ అన్నీ కలిపి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌కి సూట్ అయ్యేలా ఉన్నాయి. ఆమె ఈ లుక్‌లో కేవలం గ్లామర్‌తోనే కాదు, తనలో ఉన్న స్ట్రాంగ్ వైబ్‌ని చూపించగలిగింది. నెట్ మెష్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రస్సుకు స్లిట్ కట్ ఆకర్షణీయంగా ఉండి, సామంత యొక్క బోల్డ్ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు “ఈ లుక్‌తోనే మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చేసింది” అంటూ కామెంట్లు పెడుతున్నారు. కెరీర్ పరంగా చూస్తే... తాజాగా ఆమె ‘బంగారం’ అనే సినిమాలో నటిస్తోంది. ఇది ఆమె కామ్‌బ్యాక్ మూవీగా ట్రీట్ అవుతోంది. అంతేకాదు, ఓ ఇంటర్నేషనల్ వెబ్ సిరీస్ అయిన ‘రక్త బ్రహ్మాండ’లో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడిన సామ్ కొంతకాలం విరామం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో భాగంగా వ్యాయామం, ధ్యానం, వైద్య చికిత్సలను పక్కాగా అనుసరిస్తూ, ఇప్పుడు మళ్లీ షూటింగ్‌కి సిద్ధమవుతోంది. “ఆరోగ్యం కోల్పోయినప్పుడే మన అసలు బలాన్ని గుర్తించగలం” అంటూ గతంలో చెప్పిన సామ్ ఇప్పుడు మళ్లీ తన పని పట్ల కమిట్‌మెంట్ చూపిస్తూ, అన్ని ఫ్రంట్‌లలో ముందుకు వెళ్తోంది. ఈ తాజా లుక్‌ద్వారా ఆమె ఇప్పటికీ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచినట్టు మరోసారి ప్రూవ్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలు ఇప్పటికే లక్షల్లో లైక్స్ సంపాదించాయి. కామెంట్లలో అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్, గ్రేస్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

# ఘనంగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామివారి కల్యాణం






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవ భాగంగా రాత్రి ఆలయ మంటపములో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు, సుభద్రా బలభద్ర జగన్నాథ్ స్వామివారిని రథంపై అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణులు, పాలక మండలి సభ్యులు అధికారులు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు.

ఈ రథయాత్ర గవరపాలెం ఆలయ వద్ద నుండి బయలు దేరి పట్టణ పురవీధుల గుండా పయనించి గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజమ్మ హాలు వద్దకు చేరుకుంటుంది. డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో సిఐలు టీవీ విజయ్ కుమార్, వెంకటనారాయణ పోలీస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, కార్య నిర్వహణ అధికారి బి మురళీ, ఆలయ కమిటీ ధర్మకర్తలు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, కోటమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# 84వ వార్డులో చిన్నవీధి జార్జి స్కూల్లో విద్యార్థులకు స్కూల్ డ్రెస్ పంపిణీ : మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విద్యాశాఖ 2025–26 సంవత్సరంలో విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ పిల్లలకు ఉచితంగా ఇస్తున్న బట్టలను 84వ వార్డు కార్పొరేటర్ చిన్నతల్లి నీలబాబు ఈరోజు ఉదయం స్కూల్ హెడ్మాస్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని 35 మంది విద్యార్థులకు 35 మంది విద్యార్థినిలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలబాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నాణ్యతలేని బట్టలు పంపిణీ చేసేవారని విద్యార్థులు చాలా ఇబ్బందులు పడేవారిని రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంవత్సరం పాటు ధరించే బట్టల్లో నాణ్యత ఉండాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చి క్వాలిటీ గల బట్టలు ఇచ్చామని నీలబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వి కేఎం సన్యాసిరావు బత్తుల శ్రీనివాసరావు డి నీలకంఠ రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకున్న నాగ జగదీష్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** శ్రీ సుభద్ర బలబద్ర జగన్నాథ స్వామి రథ మహోత్సవ కార్యక్రమం ఈరోజు ఉదయం శాస్త్రోత్రంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం రథయాత్ర ప్రారం భోత్సవ కార్యక్రమంనకు మాజీ శాసన మండలి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు స్వామివారి దర్శనం చేసుకుని పూజా కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాల స్వీకరించిన అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి సూర్యనారాయణ (బుజ్జి) నాగ జగదీష్ శాలువతో సత్కరిం చారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి సంవత్సరానికి ఒకసారి జరిగే రథోత్సవం కార్యక్రమంలో భక్తులు ఆనందోత్స వాలతో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామి వారి రథంపై కొబ్బరికాయ కొట్టి స్వామివారిని దర్శించుకోవడంతో భక్తులు మనసు ప్రశాంతత స్వామిని నమస్కరించుకుంటారని మొక్కులు చెల్లించుకుంటారని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ నాయకులు మల్ల గణేష్ బుద్ధ లక్ష్మీ అప్పారావు బుద్ధ విశ్వనాథం దాడి గోవింద దాడి వాసు యలమంచిలి బంగార్రాజు ప్రముఖ కూరగాయల వర్తకులు సేవా తత్పరుడు మల్ల జగ్గప్పారావు తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

# మెట్ట కాలువ పనులు ప్రారంభం





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రివర్యులు అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ శాసనసభ్యులు అనకాపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సూచనలతో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకొని కసింకోట మండలం ఏఎస్ పేట డ్యాం మెట్ట కాలువ ఏనుగు తుని మీదగా జంపాలెం సోమలింగపాలెం వైపు వెళ్లే మెరక కాలువ మిషన్‌తో వెంటనే పనులు ప్రారంభించాలి సంబంధిత అధికారులతో మాట్లాడిన నేపథ్యంలో ఈరోజు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి నీటి సంఘం చైర్మన్ ఉప్పలూరి అప్పలనాయుడు పూజ కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి పనులు మొదలు పెట్టడం జరిగింది చిరంజీవి మాట్లాడుతూ ఈ మెట్ట కాలువ తవ్వటం వలన ఐదు గ్రామాల పంట పొలాలకు నీరు సరఫరా అవుతుందని ఈ ఐదు గ్రామాల ప్రజలు పెద్దలు కూటమి నాయకులు ఎమ్మెల్యే రామకృష్ణకి గోవింద సత్యనారాయణలకు మరియు రామకృష్ణ (రాంకీ) కి శ్రీనివాసరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు మలశాల నానాజీ కర్రి అప్పన్న రమణ సమీలు తెరపల్లి శ్రీను మణికంఠ నీటి సంఘం డైరెక్టర్స్ తాడి లచ్చబాబు అల్లా త్రినాధ్ పొలమరశెట్టి వెంకట అప్పారావు మరియు గ్రామ పెద్దలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలి

## - రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన డిఆర్వో వై.సత్యనారాయణ రావు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా గురువారం ఉదయం జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేసిన ఆర్డీఓ అక్కడ పరిస్థితులను పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల ఉన్న ఈవిఎంలను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీఓ మాట్లాడారు.

పార్లమెంటు, అసెంబ్లీల వారీగా భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను ఆర్డీఓకు ఎన్నికల విభాగం అధికారులు ఆర్డీఓకు వివరించారు. ఈ కార్యకమంలో అనకాపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ అయిష, జిల్లా అగ్నిమపాక శాఖ అధికారి ఆర్. వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం, సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి. నాయుడు, తెలుగుదేశం, బి.జె.పి, వైసీపీ, ఆప్ పార్టీ, సి.పి.ఎం పార్టీల ప్రతినిధిలు బి.శ్రీనివాసరావు, వి.రమేష్, జె. రమేష్, కె.హరినాధబాబు, ఆర్ శంకరరావు, విద్యుత్ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## - వెంకటగిరిలో కూటమి నేతలు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ : సర్కిల్ ఇన్స్పెక్టర్. ఏవి రమణ





**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్య ఆటలపై మక్కువ చూపాలని వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వదయ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రాంగణం నుండి ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీకి విద్యార్థులు, పోలీసులు భారీగా హాజరయ్యారు. డ్రగ్స్ వినియోగం వలన సమాజానికి కలిగే హానిని ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ఈ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా పోలేరమ్మ ఆర్చ్ పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. విద్యార్థులు, పోలీసుల సమక్షంలో డ్రగ్స్ విపత్తును అరికట్టేందుకు ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల నివారణకు మనందరం కట్టుబడి ఉండాలి వంటి నినాదాలు ప్రతిధ్వ నించాయి. ఈ సందర్భంగా వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ మరియు గూడూరు డిఎస్పి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువతను డ్రగ్స్ నుండి దూరంగా ఉంచడమే మా ప్రధాన లక్ష్యం. ఈ దిశగా విద్యార్థులు, మరియు యువకులు సహకారంతో మరిన్ని అదేవిధంగా పట్టణ ప్రముఖులు పార్టీ నేతలు తో కలిసి కార్యక్రమాలు చేపడతాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎస్సై ఏడుకొండలు, కూటమి నేతలు మరియు స్కూల్, ఉపాధ్యాయులు, కాలేజీ లెక్చరర్స్, ఎన్సిసి విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan